స్కెచ్

# నీరసం, గుండెదడ, దెయ్యాలు

అవసరాల రామకృష్ణరావు

కాకినాడలో పని చూసుకొని స్టేషనుకు వచ్చే సరికి అయిదు గంటలయింది. ప్యాసింజరు మూడు గంటలు లేటుట. ఈ మూడుగంటలూ ఎలా గడపడం? ఏదైనా పత్రిక కొనుక్కుందామంటే 'బుక్‌స్టాలు' మూసేసి ఉంది. ఏంచెయ్యాలా అని ఆలోచిస్తూ ఉంటే మా స్నేహితుడు కృష్ణమూర్తి జ్ఞాపకానికి వచ్చాడు. అనేకమార్లు వ్రాశాడు 'అనేకమార్లు కాకినాడ పనిమీద వస్తుంటావ్, ఒక్కపూట మాయింట్లో దిగాలిరా' అని- సమయానికి జ్ఞాపకం వచ్చాడనుకొని, వెంటనే ఓరిక్షావాణ్ణి పిలిచి 'ఏమోయ్, గాంధీనగరంలో సుధాభవన్‌ట ఎరుగుదువా?' అన్నాను. వాడు తలవూపేడు.

సుధాభవన్ కనుక్కోడానికి కెంతో సేపు పట్టలేదు. దిగి రిక్షావాడికి డబ్బులిచ్చి ఓసారి ఆ భవనాన్ని ఎగాదిగా చూశాను. దాన్ని భవనము అనేకంటే 'వనము' అంటే కాస్త సత్యం పలికినట్లవుతుంది. వాణ్ణి పిలవకుండానే ఓ చేతిలో ఎంగిలాకులూ మరోచేత్తో చెంబూ పట్టుకుని మావాడు పెరట్లోంచొచ్చి నన్ను చూసి గతుక్కుమని 'ఏంవోయ్ రఘూ, బహుకాల దర్శనం- రా రా, లోపలికి రా' అన్నాడు. నేను లోపలికి వెళ్ళి ఓ కుర్చీలో కూర్చున్నాను. కుశలప్రశ్నానంతరం 'ఒరే మూర్తీ, నేను మళ్లీ గంటలో ప్యాసింజరు కందుకోవాలి ఊరికే యివీ అవీ చేసి శ్రమపడకు' అన్నాను.

'ఇవీ అవీ అంటే నీ ఉద్దేశం?' అని వాడడిగే సరికి, నా చనువు సహం వచ్చింది. 'అదేన్రా, వంటలోకి కూరలూ పచ్చళ్లూ చేయించి ఆవిడను ఊరికే యిబ్బంది పెట్టకు' అన్నాను.

'ఆవిడ నాకోసమే యిబ్బంది పడదు- అలాంటిది నీకోసం పడుతుందా? వంట చేస్తేకదా కూరలూ పచ్చళ్లూను? నేను మళ్ళీ వండలేను బాబూ!' వాడి నిర్మొహమాటం చూసి నేనాశ్చర్యపోయాను.

'అదేమిట్రా? ఇవాళ నువ్వేనా ఏమిటి వంట?'

'ఆహాఁ'

'మీ ఆవిడ బయటుందా ఏమిటి?'

'లేదు. లోపలే ఉంది'

'అదేం? ఏమైనా జబ్బా?' అయినా లోలేదు ఆస్తి ఉన్నవాళ్ళు వంటమనిషిని పెట్టుకోకుండా నువ్వు వండటమేమిటి?

'ఏంచెప్పనురా రఘూ నా అవస్థ కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది. ఎవరికో చెప్పుకుంటే హాస్యాంగా నవ్వుతారే గాని ఒక్కరూ సీరా ఆప్యాయంగా పలకరించేవారు లేరు.' వాడి దిక్కుమొహం చూస్తే నాకే నవ్వొచ్చింది గాని అతిప్రయత్నంమీద ఆపుకున్నాను.

'అయితే, రోజూ నువ్వే వంటా?'

'మరి ఆవిడ జబ్బుమనిషాయెను, ఏం చెయ్యను?'

'ఏం జబ్బు, నాకన్నీ సరిగ్గా చెప్పారేయ్, డాక్టరుకి చూపించావా?'

'ఒక్క డాక్టరికా? పదిమందికి చూపించాను. ఎవరి నడిగినా ఏమీ లేదన్నారు. ఆవిడమాత్రం అస్తమానూ 'నీర్సంగా ఉందండోయ్- గుండెదడ ఎక్కువయిపోతోందండోయ్, ఊపిరి అందడం లేదండోయ్ - గాలి బంధించేస్తోందండోయ్' అంటూ ఉంటుంది. 'అబ్బా, ఉస్సు, అయ్యో, ఆయాసం' యివే మాటలు-విశాఖపట్నం తీసికెళ్లేను. 'ఈ మనిషికి వ్యాయామం లేదు. మీరు కొన్నాళ్లు తప్పుకుంటేనేగాని యీ రోగం కుదరదు-శుద్ధ జరుగుబడి సంకటం' అని వాళ్ళు చెప్పేరు. వాళ్లా మాట అన్నారని మా ఆవిడ

వాళ్లని తిట్టితిట్టి దిగనారబోసి మొహం పుట్—బాల్ అయేదాకా ఏడ్చింది. 'నా రోగం వాళ్లకెప్పుడు వస్తుందో, నాలా, వాళ్లు ఎప్పుడు ఏడుస్తారో అందరిలాంటి రోగాలూ వస్తే బాగానే ఉండును' అని ఏక మొత్తాన్ని అందర్నీ తిట్టి పోసింది. ఇది యిలా వుందా?' అని మావాడింకా ఏదో చెప్పబోతూంటే—

'సరిగ్గా భోంచేస్తుందా, ఫలహారాలు తీసుకుంటుందా?' అని అడిగేను.

'ఓ! అందులో మహా నేర్పరి. తిన్నదంతా అందరిలాగా అరిగితే బాగానే ఉండును అంటుంది.'

'మరే మాతుంది!'

'నీరైపోతుందిట!'

'సరేలే. పోనీ ఏదైనా టానిక్ యిప్పించలేకపోయావా?'

'మూడు పూటలా యింతో అంతో ఎంగిలి పడుతూనే ఉంటుంది. రెండు పూటలా కాఫీ తప్పదుగదా? ఆరారా హార్లిక్సులూ పళ్లరసాలూ సరే యివి ఓ లెక్కా ఏమిటిగాని అప్పుడప్పుడు ఎండు ద్రాక్షపళ్ళు కొరకడం అనీ, దానిమ్మపళ్ళ రుచి చూడడమనీ యిలాంటివి జరుగనే జరుగుతాయి. ఇక టానిక్కులు ఎందుకూ! అయినా బలానికి, జీర్ణానికీ యిప్పిస్తు నేవుస్సాను.'

నేను నవ్వాపుకో లేక పకపక నవ్వేశాను.

'అదుగో నేను నవ్వుతారనే చెప్పను. వీలు లేక, తప్పక ఎంగిలి పడుతోందిగాని దానికి అరుగుతుందా, ఏమైనానా? పాపం ఎంత బాధపడుతోందో' అని మావాడు కంట తడిపెట్టేడు.

'ఛా నేను అందుకు నవ్వలేదురా, ఏదో జ్ఞాపకమొచ్చి నవ్వేను. సరేగాని వంటమనిషినైనా పెట్టించక నువ్వే చేసుకోడమెందుకూ?'

'విను మరి. యిదిచాలక మా ఆవిడకి దెయ్యం కూడా పడుతూంటుంది.'

'సరి-సరి-ఇదొకటా?'

'మొట్టమొదట వంటమనిషిని పెట్టేను-కాని పోయిన మా అత్తగారికి మా ఆవిడమీద ఎంత అభిమానమో చూడు, కూతురిమీద ఆవేశించి 'ఒరేయ్ కృష్ణమూర్తీ! రత్తమ్మలాంటి మనిషి లేదురోయ్! దాన్ని ఇబ్బంది పెట్టకురోయ్-అది సంకటపు పీనుగురోయ్, వంటవాళ్ళ తిళ్ళు అది తినలేదురోయ్, నువ్వు చేస్తున్న పనేమిట్రోయ్! నువ్వు స్వయంగా వండి పెడితేగాని అది తినలేదురోయ్. నా కూతుర్ని పువ్వుల్లో పెట్టి పూజించాలిరోయ్ అం హూం హేం' అని అరిచింది - అప్పట్నుంచి నేనే స్వయంగా వండి పెడుతున్నాను, ఏం చెయ్యను చెప్పు మరి?'

'భూత వైద్యుణ్ణి పిలిపించక పోయావా?'

'ఆ పనీ చేశాను. భూత వైద్యుడు వచ్చేసరికల్లా 'వాడు భూతవైద్యుడెందుకురోయ్ వెంటనే పంపించెయ్యరోయ్ లేకపోతే నీ యిల్లంతా నాశనము చేస్తానురోయ్' అని తాండవం ఆడింది. నేను భూతవైద్యుణ్ణి సలహా అడిగేను. 'బాబూ ఆ భూతం విలాసమే అంత. దీనికి తగిన శిక్ష చెయ్యాలి' అని ఏవో మంత్రాలు జపించి కొరడా తీశాడు. ఇంకా కొట్టకుండానే మా ఆవిడ మంచంమీద పడిపోయింది. మరోగంటకు లేచి 'నేను ఎక్కడున్నానూ?' అని గదంతా ఆశ్చర్యంగా చూసి 'నాగుండెలమీద ఎవరో కొట్టినట్టుయిందండోయ్' అంది.


ప్రఖ్యాతిగాంచిన ప్రశస్తమైన

## మెహతావారి
## విశేష ఔషధములు

1 సుందరి ఎలిక్జిర్ :—సమస్త ఋతు దోషములను పోగొట్టును, గర్భాశయరోగ అనుపను నివారిణి.

2 ఫాస్ఫరస్ ఆయిల్ :—బాధ నివారణకు సాటిలేని తైలము.

3 మస్తానా పిల్సు :—సాధారణబలహీనత, కీళ్లనొప్పులు, జ్వరము అన్నిటికీ అమోఘముగా పని చేయును.

4 ద్రాక్షాసవము :—(బంగారము, మకరధ్వజము కలిసినది) రక్తమును శుద్ధి పరచునటువంటి, అజీర్ణము రూపు మాపునటువంటి బలవర్ధకౌషధము.

కెమిస్టు లందరివద్ద దొరకును.

తయారు చేయువారు :

**K. S. MEHTA & CO.,**
**250, China Bazar, Madras.**

ఈ కబుర్లలో పడి నేను టైమే మరచిపోయాను. వాచీ చూసుకొనే సరికి ఎనిమిదిన్నర అయింది. నేను ఆరాత్రి ప్రయాణమెలాగా ఆగిపోయిందనుకొని,

'ఒరే, నీ సంసారం క్షణంలో బాగుచేస్తాను. ఏమిస్తావ్?' అన్నాను కొంత సేపాలోచించి. వాడికళ్లు ఆశతో మెరిశాయి. నాకు మంచి ఆలోచన తట్టింది.

'అంతా నీలోనే ఉందిరా' అన్నాను.

'నాలో ఏముందీ!' అన్నాడు ఆశ్చర్యంగా.

'మరి నేచెప్పినట్లల్లా చేస్తావా?' అని అడిగాను.

'అదేమిట్రా అలా అంటావ్, నీకన్నా నాకు ఆప్తు లెవరున్నారు చెప్పు! నిజంగా చెప్తేనమ్మవు గాని ఏనాడు కట్టుకున్నానో ఓ సుఖం ఎరుగను, ఓ సంతోషం ఎరుగను - నువ్వు దారి చూపిస్తే కాదంటానా!'

'అనకూడదుగాని నీ అంత వెర్రివాడు ప్రపంచంలో లేడు. యిలారా చెబ్తాను. అన్నట్టు మీ ఆవిడకి రేపుగాని దెయ్యం పడ్తుందా?'

'తప్పకుండా'

'నువ్వెలా చెప్పగలవ్!'

'అబ్బే ఎవరేనా వచ్చినప్పుడు 'ప్రదర్శన' ఎక్కువతే'

'సరే అయితే యిలారా' అని వాడి చెవులో అంతా బోధించాను - వాణ్ణి ఒప్పించే సరికి నా తాతలు దిగి వచ్చారు. వాడు సంతోషంతో పొంగి పోయాడు, ఆ పొంగు అంతా వంటలో చూపించి నాకింత వండి పెట్టేడు. వాడికి కార్యక్రమమంతా బోధించి బోధించి నిద్రపోయాను.

తెల్లవారింది. నేను మా వాణ్ని తీసుకొని దగ్గర కాఫీ హోటలుకు వెళ్లి కడుపు నిండా తిని 'సుధాభవన్' కి వచ్చేసరికి 8½ అయింది. మా వాడికి 'అనుకున్న ప్రోగ్రాం తప్పకూడదురా' అని మళ్లీ ఉషార్ యిచ్చాను. ఏంచేస్తాడో మరి'! మేము వెళ్లిన అయిదు నిముషాలికి రత్తమ్మ గదిలోంచి అరుపులు వినిపించాయ్ 'హూం, హాం ఎనిమిదిన్నర దాకా మా రత్తమ్మకు చద్దన్నం పెట్టవుట్రా. సంకటప్పేటుగ దాన్నిన్ని హింసలు పెడతావుట్రా. సోషొచ్చి పడిపోదుట్రోయ్ - నా తల్లిని హింసిస్తే నీకు అన్నం పుడుతుందిట్రోయ్ హాం! హూం!' మేమిద్దరం ఆ గదిలోకి వెళ్లేము - మమ్మల్ని చూసి రత్తమ్మ మరీ తూలిపోతోంది. నేను మా వాడికి కను సౌజ్ఞ చేశాను. వెంటనే వాడూ తూలిపోడం మొదలెట్టేడు. హ్రీం! హ్రూం! నే నెవరనుకున్నావే నీ మామగార్నే. ఒసేవ్ రత్తమ్మా, మా అబ్బాయిచేత వండించుకు తింటావుటేవ్!' రత్తమ్మ మొహం తెల్లబడింది. ఇంతలో యీ అరుపులికి ఆ చుట్టుపక్కల వారంతా పోగయ్యారు. 'ఏమిటండీ యిది?' అని నన్నడుగుతే నేను నవ్వుతూ 'సంభాషణ బాబూ! దెయ్యాల సంభాషణ!!' అన్నాను - అందరూ వింతగా చూస్తున్నారు. మా వాడు రత్తమ్మ మీద మీదకు వెళ్లి చేతులు జాపి 'నేను పరలోకంలో ఉన్నా అంతా చూస్తూనే ఉన్నానే! నీ పని పట్టకపోను లేవేవ్! మా వాడి చేత వండించుకు తిన్న నీ నోరు పడకపోదుతుందిటే? లేకపోతే నీకు నీరసా లేమిటేవ్? పోతులా ఉన్న నీకు గుండెదడ ఏమిటేవ్? నీకు హార్లిక్సు లెందుకేవ్? మా వాడి కాళ్లు పట్టుకోవేవ్? లేకపోతే నీ కంఠం పిసుకుతానేవ్' వియ్యంకుడి ఒత్తిడికి రత్తమ్మ తల్లి దెయ్యమే ఓడిపోయింది!

'పట్టుకో, రత్తమ్మా, వెళ్లి ఆయన కాళ్లు పట్టుకో' అని అక్కడున్న పెద్దలందరూ చెప్పగానే రత్తమ్మ చేసేదిలేక, తప్పక, మా వాడి రెండు కాళ్లూ పట్టుకుంది. మా వాడు ఆ రెండు చేతులూ భడేలున తన్ని 'నీ పాప హస్తాలు మా వాడిమీద పెట్టకేవ్? వాడిచేత సకల చాకిరీ చేయించుకున్న నీ చేతులుకి వాడి కాళ్ళయినా పట్టుకోడానికి అర్హత లేదేవ్? లెంపలు వాయించుకోవేవ్' రత్తమ్మ లెంపలు వాయించుకుంది. మా వాడు అరచి అరచి పడిపోయాడు. మరో గడియకు కళ్లు విప్పి రత్తమ్మను చూసి 'ఏదో వాలినట్టుందే' అన్నాడు. రత్తమ్మ సిగ్గుతో తల వంచుకొంది.

ఆ దెబ్బతో రత్తమ్మ కి దెయ్యమే గాక నీర్సాలు, గుండె దడ, సమస్తం పోయాయి. నా కళ్లు ఆనందంతో చెమ్మగిల్లేయి! మా వాడు నన్ను కౌగిలించుకుని నీ రుణం ఎలా తీర్చుకోనురా అన్నాడు - ఆ సాయంత్రం రత్తమ్మా కృష్ణమూర్తి స్టేషనుకు వచ్చి నన్ను దిగబెట్టేరు! ఒక్క రోజులో నేను ఎంత ఘన కార్యం చేసేను!